
# సిమెంట్ ధరలకు రెక్కలు?

**ఈ ఆర్థిక సంవత్సరం 4 శాతం వరకు విజృంభించనున్న రేట్లు**

**మార్కెట్‌లో 7.5 శాతం మేరకు పెరగనున్న డిమాండ్: క్రిసిల్ అంచనా**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) దేశీయ మార్కెట్‌లో సిమెంట్ ధరలు 2 నుంచి 4 శాతం (రూ.15-20) మేరకు పెరిగే వీలున్నట్టు ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ, విశ్లేషణ సంస్థ క్రిసిల్ ఓ తాజా రిపోర్టులో అంచనా వేసింది. అలాగే డిమాండ్ 6.5 శాతం నుంచి 7.5 శాతం వరకు పెరగవచ్చని కూడా అన్నది. ప్రధాన మౌలిక వసతుల కల్పనకు, గ్రామీణ హౌజింగ్ ప్రాజెక్టులకు ఈసారి బడ్జెట్‌లో 10 శాతం దాకా కేటాయింపులు పెరగడం, రాబోయే వర్షాకాలంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదు అవుతుందన్న అంచనాలు సిమెంట్ వినియోగాన్ని, పరిశ్రమను ఉత్సాహపరుస్తున్నాయని పేర్కొన్నది. వ్యవసాయం లాభసాటిగా మారితే గ్రామీణ ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణాలు ఊపందుకుంటాయని కూడా క్రిసిల్ ఇంటిలిజెన్స్ అసోసియేట్ డైరెక్టర్ సచిదానంద్ చౌబే చెప్తున్నారు. కాగా, గత ఆర్థిక సంవత్సరం (2024-25) సిమెంట్ ఇండస్ట్రీలో వృద్ధిరేటు 4.5-5.5 శాతంగానే ఉన్నది. అయితే లోక్‌సభ ఎన్నికలు, అంతకుముందు మూడు ఆర్థిక సంవత్సరాల్లో అధిక వృద్ధిరేట్లే ఇందుకు కారణమని చెప్తున్నారు.

### మౌలికమే దన్ను

రోడ్ల నిర్మాణాలు ఈ ఆర్థిక సంవత్సరం పెద్ద ఎత్తున జరిగే వీలుండటం సిమెంట్ వినియోగపు అంచనాల్ని అమాంతం పెంచేస్తున్నాయని క్రిసిల్ అంటున్నది. రైల్వేలు, సాగునీటి ప్రాజెక్టులు, పట్టణ మౌలిక సదుపాయాల కల్పన కూడా జోరుగా జరుగవచ్చన్న అంచనాలున్నాయి. ఈ క్రమంలోనే సిమెంట్‌కు గిరాకీ బాగా పెరగవచ్చని క్రిసిల్ అంచనా వేస్తున్నది. ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై), మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఏ) వంటి పథకాలు సైతం సిమెంట్ ఇండస్ట్రీకి దన్నునిస్తున్నట్టు పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. మొత్తానికి కేంద్ర ప్రభుత్వ పథకాలు, గ్రామీణ ప్రాంతాల్లో డిమాండే ఈసారి సిమెంట్ పరిశ్రమ ఆదాయానికి కీలకంగా మారనున్నాయి.

### పట్టణ డిమాండ్ అంతంతే

దేశంలోని అన్ని ప్రధాన నగరాలు, పట్టణాల్లో నిర్మాణ రంగం నిరాశాజనకంగా ఉండటం సిమెంట్ పరిశ్రమకు ఎదురుదెబ్బగానే విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు. గృహ రుణాలపై వడ్డీరేట్లు ఆశించిన స్థాయిలో తగ్గకపోవడం కొనుగోలుదారులను నిరుత్సాహపరుస్తున్నదని చెప్తున్నారు. ఇప్పటికే పెరిగిన నిర్మాణ వ్యయం కూడా కస్టమర్లను వేచిచూసే ధోరణిలోకి నెడుతున్నదని, దీంతో ఇప్పటికే నిర్మించిన ఇండ్లు అమ్ముడుపోక, కొత్త ప్రాజెక్టులపై రియల్టర్లు పెద్దగా ఆసక్తి చూపట్లేదన్న వాదనలూ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ వంటి నగరాల్లో ఇండ్ల అమ్మకాలు పడిపోవడం, మార్కెట్‌లో స్తబ్ధత నెలకొనడం పరిశ్రమకు ప్రతికూలమని అభిప్రాయపడుతున్నారు. అయితే హైదరాబాద్‌సహా ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పుంజుకొంటే సిమెంట్ ధరలు ఇంకా పెరిగే వీలుందన్న అంచనాలూ ఉన్నాయి.

# లక్ష రూపాయలు దాటిన పుత్తడి

### మరో రూ.1,800 పెరిగిన తులం ధర

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: బంగారం ధరలు భగభగమండుతున్నాయి. తొలిసారిగా లక్ష రూపాయల మైలురాయిని అధిగమించి రికార్డు నెలకొల్పింది పుత్తడి. దేశీయ రాజధానిలో పదిగ్రాముల బంగారం ధర రూ.1,800 ఎగబాకి లక్ష రూపాయల పైకి చేరుకున్నది. ప్రాంతీయ ఆభరణాల వర్తకులు, స్టాకిస్టులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతోపాటు వచ్చేవారంలో అక్షయ తృతీయ, ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్ కావడంతో డిమాండ్ అధికంగా ఉంటుందన్న అంచనాతో ధరలు భారీగా పెరుగుతున్నాయి.



ట్రేడ్ వార్‌తో ప్రపంచ దేశాల ఆర్థికంపై అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణం. దీంతో ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.1,01,600కి చేరుకున్నది. సోమవారం ఇది రూ.99,800గా ఉన్నది. గతేడాది డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు బంగారం ధర రూ.22,650 లేదా 29 శాతం ఎగబాకింది. మరోవైపు, వెండి ధరలు నిలకడగా రూ.98,500 వద్ద స్థిరంగా ఉన్నాయి. అలాగే హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం గోల్డ్ ధర రూ.3,000 ఎగబాకి రూ.1,01,350కి చేరుకున్నది. అంతకు ముందు ఇది రూ.98,350గా ఉన్నది. అలాగే 22 క్యారెట్ ధర రూ.2,750 అందుకొని రూ.92,900 పలికింది. కిలో వెండి రూ.1,11,000గా నమోదైంది.

### అక్షయ తృతీయకు డిమాండ్ అంతంతే

రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలతో సామాన్యుడితోపాటు సంపన్నవర్గాలు కొనుగోలు చేయడానికి జంకుతున్నారు. ఈనెల 30న అక్షయ తృతీయ సందర్భంగా కొనుగోళ్లు భారీగా తగ్గే అవకాశాలున్నాయని బులియన్ వర్తకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

### బంగారం ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు

- **టారిఫ్‌ల విషయంలో అమెరికా ఇతర దేశాలతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా చర్యలు తీసుకుంటుండటం**
- వడ్డీరేట్ల తగ్గింపుపై ఫెడరల్ రిజర్వు చీఫ్ జెరోమ్ పోవెల్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య వివాదం నెలకొనడం
- **చైనాతోపాటు ప్రపంచవ్యాప్తంగా కేంద్రబ్యాంకులు బంగారాన్ని పెద్ద మొత్తంలో కొనుగోలు చేయడం**
- అమెరికా కరెన్సీ డాలర్ బలహీనపడటం

# ఆరో రోజూ లాభాల్లో సూచీలు

ముంబై, ఏప్రిల్ 22: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఆరో రోజూ లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లకు లభించిన మద్దతుతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులు పెట్టడం సూచీల్లో జోష్ పెంచింది. ఇంట్రాడేలో 400 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 187.09 పాయింట్లు అందుకొని 79,595.59 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 41.70 పాయింట్లు ఎగబాకి 24,167.25 వద్ద స్థిరపడింది. భారీగా లాభపడ్డ సూచీలకు ఐటీ, ఎనర్జీ రంగ షేర్లు బ్రేకులు వేశాయని, అయినప్పటికీ రియల్టీ, ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ రంగ సూచీలు ఇచ్చిన దన్నుతో లాభాల్లో ముగిశాయి. ఐటీసీ, హెచ్‌యూఎల్, మహీంద్రా అండ్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్‌ల షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించగా..మరోవైపు ఇండస్ఇండ్ బ్యాంక్ 4.88 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు పవర్‌గ్రిడ్, భారతీ ఎయిర్‌టెల్, ఇన్ఫోసిస్, బజాజ్ ఫిన్‌సర్వ్‌లు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే రియల్టీ 2.40 శాతం లాభపడగా, ఎఫ్ఎంసీజీ 1.87 శాతం, కన్జ్యూమర్ డ్యూరబుల్ 1.43 శాతం, హెల్త్‌కేర్, బ్యాంకింగ్ రంగ సూచీలు లాభపడగా..టెక్నాలజీ, ఐటీ, పవర్, యుటిలిటీస్, టెలికం రంగ షేర్లు నష్టపోయాయి.

### హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రికార్డు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నది. మంగళవారం సంస్థ షేరు 2 శాతం లాభపడటంతో బ్యాంక్ మార్కెట్ విలువ రూ.15 లక్షల కోట్లు దాటింది. ఈ మైలురాయికి చేరుకున్న మూడో సంస్థ కూడా హెచ్‌డీఎఫ్‌సీ కావడం విశేషం. గడిచిన పదిహేను రోజుల్లో బ్యాంక్ షేరు 11 శాతం లాభపడటంతో మార్కెట్ క్యాప్ రూ.1,50,289.64 కోట్లు పెరిగి రూ.15,01,289.37 కోట్లుగా నమోదైంది.

# సత్తా చాటిన తెలంగాణ తేజాలు

- **సాయి శివానీకి 11వ ర్యాంకు**
- **కానిస్టేబుల్ కుమారుడికి 68వ ర్యాంకు**
- **టాప్-10లో తెలంగాణకు దక్కని చోటు**
- **100లో 13 మంది తెలుగు విద్యార్థులు**
- **తెలుగు రాష్ర్టాల నుంచి 78 మంది ఎంపిక**
- **1,009 మంది ఫలితాలు విడుదల**

హైదరాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ) : యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) వెలువరించిన సివిల్స్-2024 తుది ఫలితాల్లో తెలంగాణకు ర్యాంకుల పంట పండింది. రాష్ర్టానికి చెందిన ఎట్టబోయిన సాయిశివాని 11వ ర్యాంకు సాధించింది. వరంగల్‌కు చెందిన రావుల జయసింహారెడ్డి 46వ ర్యాంకు, హైదరాబాద్‌కు చెందిన చింతకింది శ్రావణ్‌కుమార్‌రెడ్డి 62వ ర్యాంకు, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన సాయి చైతన్యజాదవ్ 68వ ర్యాంకుతో అదరగొట్టారు. అయితే టాప్-10లో ఒక్కరు కూడా తెలంగాణకు చెందిన వారు లేరు. ఈ సారి మొత్తం గా 1,009 మంది ఫలితాలను యూపీఎస్సీ విడుదల చేయగా, క్యాటగిరీవారీగా తీసుకుంటే జనరల్ 335, ఈడబ్ల్యూఎస్ 109, ఓబీసీ 318, ఎస్సీ 160, ఎస్టీ 87 క్యాటగిరీ అభ్యర్థులున్నారు. ఈ సారి తెలంగాణ, ఏపీ నుంచి సివి ల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారి సంఖ్య పెరిగింది.


సాయిశివాని


జయసింహారెడ్డి

రెండు రాష్ర్టాల నుంచి 78 మంది ఎంపికైనట్టు లా ఎక్స్‌లెన్స్ డైరెక్టర్ రాంబాబు పాలడుగు అంచనావేశారు. టాప్-100లో 13 మంది తెలుగు విద్యార్థులున్నట్టు విశ్లేషించారు.

### కోచింగ్ తీసుకోకుండా 11వ ర్యాంకు

వరంగల్ శివనగర్‌కు చెందిన సాయిశివాని కోచింగ్ తీసుకోకుండానే, సొంత ప్రిపరేషన్‌లో, నిపుణుల మార్గదర్శనంలో ఏకంగా ఆలిండియా 11వ ర్యాంకు సాధించడం గమనార్హం.

### కానిస్టేబుల్ కొడుకు.. కలెక్టర్ కాబోతున్నడు

నాన్న కానిస్టేబుల్. అమ్మ టీచర్. సివిల్స్ ప్రయత్నంలో ఐదు సార్లు విఫలమయ్యాడు. అయినా ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. క్రమపద్ధతిలో హార్డ్‌వర్క్‌చేసి సక్సెస్ సాధించాడు సాయిచైతన్య జాదవ్. తల్లిదండ్రులిచ్చిన ప్రోత్సాహం మరువలేనిదని, 68వ ర్యాంకు వస్తుందని ఊహించలేదని సాయిచైతన్య తెలిపాడు. హనుమకొండకు చెందిన రావుల జయసింహారెడ్డి స్టేట్ రెండో టాపర్(46వ ర్యాంక్)గా నిలిచాడు. నల్లమలకు చెందిన దళిత యువకుడు మొదటిసారే సత్తా చాటాడు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని అమ్రాబాద్ మండలం మన్ననూర్ వాసి సాయికిరణ్ 298వ ర్యాంక్ సాధించాడు. హనుమకొండలోని బాలసముద్రంకు చెందిన హరిప్రసాద్ 255వ ర్యాంక్ సాధించాడు.

| పేరు | ర్యాంకు |
|---|---|
| ఎట్టబోయిన సాయి శివానీ | 11 |
| రావుల జయసింహారెడ్డి | 46 |
| చింతకింది శ్రావణ్ కుమార్‌రెడ్డి | 62 |
| సాయిచైతన్య జాదవ్ | 68 |
| కొలిపాక శ్రీకృష్ణ సాయి | 190 |
| కౌశిక్ నర్సింహ | 225 |
| పోతరాజు హరిప్రసాద్ | 255 |
| సాయికిరణ్ | 298 |
| రాపర్తి ప్రీతి | 451 |
| బానోతు నాగరాజు నాయక్ | 697 |
| తొగరపు సూర్యతేజ | 799 |
| గోకమల్ల ఆంజనేయులు | 934 |
| రామటెంకి సుధాకర్ | 949 |

# సివిల్స్ ఫలితాల్లో నారీశక్తి

- **యూపీకి చెందిన శక్తి దూబేకు ఫస్ట్ ర్యాంకు**
- **టాప్-5లో ముగ్గురు మహిళలు**
- **టాప్-20లో ఏకంగా 11 మంది**
- **ఫలితాలు ప్రకటించిన యూపీఎస్సీ**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 22: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్- 2024 ఫలితాల్లో నారీశక్తి ప్రతిబింబించింది. టాప్-5లో ముగ్గురు యువతులు ఉండగా, టాప్-20లో ఏకంగా 11 మంది చోటు దక్కించుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన శక్తి దూబేను మొదటి ర్యాంకు వరించిం ది. హర్షితా గోయల్‌కు రెండో ర్యాంకు, షా మార్గి చిరాగ్ నాలుగో ర్యాంకు దక్కించుకున్నారు. డోంగ్రే అర్చిత్ పరాగ్‌కు మూడో ర్యాంకు, ఆకాశ్ గార్గ్‌కు ఐదో ర్యాంకు లభించినట్టు యూపీఎస్సీ మంగళవారం ప్రకటించింది. ప్రథమ ర్యాంకర్ శక్తి దూబే యూపీలోని అలహాబాద్ యూనివర్సిటీ నుంచి బయోకెమిస్ట్రీలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ డిగ్రీ పొందారు. రెండవ ర్యాంకు సాధించిన హర్షితా గోయల్ ఎంఎస్ యూనివర్సిటీ ఆఫ్ బరోడా నుంచి బీకాం పట్టభద్రురాలు. మూడో ర్యాంకు సాధించిన డోంగ్రే అర్చిత్ పరాగ్ తమిళనాడులోని వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్) నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో బీటెక్ పట్టభద్రుడు. నాలుగో ర్యాంకు సాధించిన షా మార్గి చిరాగ్ అహ్మదాబాద్‌లోని గుజరాత్ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి కంప్యూటర్ ఇంజనీరింగ్‌లో బీఈ పట్టా పొందారు.

## 'మానవతా విలువలతో జీవించడమే నిజమైన దైవభక్తి'


మాట్లాడుతున్న సింగరేణి పీవీకే గని మేనేజర్ శ్యాంప్రసాద్

రామవరం, ఏప్రిల్ 22: మానవతా విలువలతో జీవించడమే నిజమైన దైవభక్తి అని కొత్తగూడెం సింగరేణి పీవీకే 5 ఇంక్లైన్ గని మేనేజర్ శ్యాంప్రసాద్ అన్నారు. మనిషిని మనిషిగా, మంచి వాడిగా ఉంచేందుకు పండుగలు శిక్షణ ఇస్తాయని అన్నారు. ఈద్ మిలాప్‌లో భాగంగా గనిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి పండుగలు జరుపుకోవడం సంతోషకరమని అన్నారు. జమాతే బాధ్యులు, సింగరేణి అధికారులు, కార్మిక నాయకలు పాల్గొన్నారు.


## 'భూమి పరిరక్షణ కోసమే ధరిత్రీ దినోత్సవం'



ధరిత్రీ ర్యాలీని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు, పాల్గొన్న విద్యార్థులు


పాల్వంచ, ఏప్రిల్ 22: భూమి పరిరక్షణ కోసమే ధరిత్రీ దినోత్సవం ఆవిర్భవించిందని కొమ్ముగూడెం జడ్పీఎస్ఎస్ హెచ్ఎం మాధవరావు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎకో క్లబ్‌లో భాగంగా స్థానిక పాఠశాలలో చేపట్టిన ధరిత్రీ దినోత్సవ ర్యాలీని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. భూమి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 1970 నుంచి ఏప్రిల్ 22న ఏటా ధరిత్రీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలు, హోర్డింగులు కడితే చర్యలు తప్పవు: డీఎస్పీ


డీఎస్పీ రెహమాన్

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 22: అనుమతులు లేకుండా ఫ్లెక్సీలు, హోర్డింగులు కడితే చట్టరీత్యా చర్యలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రాజకీయ, పుట్టిన రోజు, ఇతర కార్యక్రమాలకు సంబంధించిన ఫ్లెక్సీలు, హోర్డింగులను కొత్తగూడెం సబ్ డివిజన్ పరిధిలో ఇటీవల కాలంలో కొందరు ఇష్టానుసారంగా ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. ఆ ఫ్లెక్సీలు, హోర్డింగుల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉందన్నారు. ఈదురుగాలులు, వర్షాల వల్ల ఫ్లెక్సీలు, హోర్డింగులు రోడ్లపై వెళ్లే వాహనదారులు, పాదచారులపై పడే ప్రమాదం ఉందన్నారు.

## పాఠశాలకు తాగునీటి శుద్ధి యంత్రం బహూకరణ


తాగునీటి శుద్ధి యంత్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ వెంకటేశ్వర్లు

జూలూరుపాడు, ఏప్రిల్ 22: మండలంలోని కాకర్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన పురాణం ఆంజనేయశాస్త్రి మనవడు పురాణం అనిల్‌శర్మ రూ.25 వేల విలువైన తాగునీటి శుద్ధి యంత్రం (వాటర్ ప్యూరిఫైర్)ను బహూకరించారు. పాఠశాలలో అమర్చిన యంత్రాన్ని సంతాన వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్ డిల్లి వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. ఎంఈవో జుంకీలాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సింగరేణి మెరిట్ స్కాలర్‌షిప్ రూ.16 వేలకు పెంపు

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 22: ఎప్‌సెట్, నీట్, జేఈఈ మెయిన్స్, ఎయిమ్స్ తదితర కోర్సుల ప్రవేశ పరీక్షల్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన సింగరేణి కార్మికులు, అధికారుల పిల్లలకు ఇప్పటి వరకు ఇస్తున్న మెరిట్ స్కాలర్‌షిప్ మొత్తాన్ని రూ.10 వేల నుంచి రూ.16 వేలకు పెంచుతూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే కనీస ర్యాంకును కూడా 2 వేల నుంచి 8 వేల వరకు పెంచినట్లు మంగళవారం తెలియజేసింది. ఈ మేరకు డైరెక్టర్ (పా) సర్క్యూలర్ జారీ చేశారు.

# పాల్వంచలో ఉద్రిక్తత

- **పెద్దమ్మతల్లి ఆలయ పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారంలో నిరసనలగళం**
- **స్థానికులకు అవకాశమివ్వాలంటూ కిరోసిన్‌తో ఇద్దరు యువకుల ఆత్మహత్యాయత్నం**
- **కత్తితో చేతిని కోసుకునేందుకు ఓ మహిళ ప్రయత్నం.. మరో ఇద్దరు మహిళల ఆందోళన**
- **3 మండలాల పోలీసులతో బందోబస్తు.. పోలీసు స్టేషన్లకు ఆందోళనకారుల తరలింపు**
- **బయట ఘర్షణ జరుగుతుండగానే ఆలయంలో చైర్మన్ ప్రమాణం.. ఓ మంత్రి ఆధిపత్యం?**
- **కాంట్రాక్టర్లకు, దేవాలయాలకు వెళ్లని వారికే పెద్దపీట వేశారంటూ స్థానికుల ఆవేదన**



మహిళ వద్ద ఉన్న కత్తిని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు, గుడి వద్ద ఆందోళనచేస్తున్న నిరసనకారులు




ఒంటిపై కిరోసిన్ పోసుకుంటున్న స్థానిక గ్రామాల యువకులు

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 22: కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరినీ వదలడం లేదు. తమ స్వార్థ రాజకీయాల కోసం అందరినీ వాడుకుంటోంది. ఆఖరికి దేవుళ్లను రాజకీయాల్లోకి లాగేసింది. తాజాగా భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి దేవస్థానాన్ని కూడా రాజకీయాలకు వేదికగా మలుచుకుంది. ఆలయ పాలకమండలిలో కాంట్రాక్టర్లకు, దేవుడిమీద భక్తి లేనివాళ్లకు, ఆధ్యాత్మిక భావం లేనివాళ్లకు చోటుకల్పించింది. కానీ స్థానికులను, ఆలయ పురోభివృద్ధిలో భాగమైన ఇరుగూపొరుగు గ్రామాల ప్రజలను, భక్తులను విస్మరించింది. ఎంతలా ఆందోళనలు చేసినా తన పంతాన్ని నెగ్గించుకుంది. కానీ ప్రభుత్వ చర్యకు వ్యతిరేకంగా స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. అది కాస్తా ఉద్రిక్తతకు దారి తీసింది.

ఆధ్యాత్మిక భావాలు కలిగిన వ్యక్తులకే దేవాలయ పాలకమండలిలో ప్రాధాన్యం కల్పించాల్సింది పోయి కాంట్రాక్టర్లకు, దేవాలయంతో సంబంధం లేని వ్యక్తులకు, అసలు దేవాలయానికే వెళ్లని వ్యక్తులకు ప్రభుత్వం పెద్దపీట వేసిందంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. ఇదే అంశంపై గతంలో ఘర్షణలు జరిగాయి. మంత్రుల వర్గ విభేదాల కారణంగా ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడింది. తాజాగా మంగళవారం నాటి ప్రమాణం కూడా స్థానికుల ఆందోళనల మధ్యే జరిగింది. మొత్తానికి ఓ మంత్రి తన ఆధిపత్యాన్ని ప్రదర్శించుకున్నట్లు స్థానికులు గుర్రుమంటున్నారు.

భద్రాద్రి జిల్లా పాల్వంచ మండలంలో కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య ఎంతో విశిష్టత కలిగిన పెద్దమ్మతల్లి ఆలయం ఉంది. దీని పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం మంగళవారం ఉదయం జరగాల్సి ఉంది. ఇందుకోసం దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లుచేశారు. ఈ క్రమంలో నూతన పాలకమండలిలో ఇరుగూపొరుగు గ్రామాలకు చెందిన తమకు ప్రాధాన్యమివ్వాలంటూ కేశవాపురం, జగన్నాథపురం గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు ఉదయం 8 గంటలకే ఆందోళన ప్రారంభించారు. దీంతో ప్రమాణ స్వీకారానికి బందోబస్తు కావాలంటూ ఆలయ ఈవో రజనీకుమారి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో పోలీసులు వచ్చారు. ఉదయం 11 గంటల వరకూ ఆ రెండు గ్రామాల ప్రజలు ఆలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. శాంతింపజేసే ప్రయత్నంలో పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. స్థానిక మహిళలు ఆందోళన నిర్వహించారు. బండి ఉదయ్, అజ్మీరా రమేశ్ అనే యువకులు తమ ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించారు. వారిని నివారించేందుకు పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆలయ పరిసరాల్లో ఉద్రికత్త నెలకొంది. పరిస్థితి చేయి దాటే సమయంలో పోలీసులు ఆ ఇద్దరు యువకులను లారీలో ఎక్కించి పాల్వంచ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ముగ్గురు మహిళలు ఆందోళనను ఉధృతం చేశారు. కత్తితో చేతిని కోసుకునేందుకు ఓ మహిళ యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఆమెతోపాటు మరో ఇద్దరు మహిళలను పోలీస్‌స్టేషన్ తరలించారు. అయితే, బయట ఇంతటి ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ పెద్దమ్మతల్లి ఆలయం లోపల అమ్మవారి ఎదుట దేవాదాయ, ధర్మాదాయ శాఖ భద్రాచలం ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు 13 మంది సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అయితే, అమ్మవారి దర్శనం దేవాలయానికి వచ్చిన భక్తులు ఈ తంతు చూసి ఈసడించుకున్నారు. కాగా, ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు ఆలయ సమావేశ మందిరంలో సమావేశమయ్యారు. బాలినేని నాగేశ్వరావును చైర్మన్‌గా చీకటి కార్తీక్ ప్రతిపాదించగా సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు.

## సింగరేణి గనుల ప్రైవేటీకరణను అడ్డుకుంటాం: టీబీజీకేఎస్



రామవరం, మణుగూరుల్లో అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు కాపు కృష్ణ, వెంకటేశ్వర్లు

రామవరం/ మణుగూరు టౌన్, ఏప్రిల్ 22: సింగరేణిలో బొగ్గు గనులను ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని టీబీజీకేఎస్ నేత కాపు కృష్ణ అన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా మంగళవారం జీకేవోసీ మేనేజర్ మురళిని సంఘం నాయకులు కూసన వీరభద్రం, గడప రాజయ్యలతో కలిసి కాపు కృష్ణ వినతిపత్రాన్ని అందించారు. సంఘం నాయకులు కాగితపు విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాజ్‌కుమార్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు. బొగ్గుగనుల వేలం, ప్రైవేటీకరణను వెంటనే రద్దు చేయాలని టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మణుగూరు ఏరియా వర్క్‌షాప్‌లో మంగళవారం బొగ్గుగనుల వేలానికి వ్యతిరేకంగా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన తెలిపి వర్క్‌షాప్ మేనేజర్‌కు వినతిపత్రాన్ని అందించారు. సయ్యద్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

## 'నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం'


మాట్లాడుతున్న సోందె మల్లుదొర


దుమ్ముగూడెం, ఏప్రిల్ 22: రాజీవ్ యువవికాసం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తున్నదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లుదొర డిమాండ్ అన్నారు. మంగళవారం పెద్ద ఆర్లగూడెంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే నిరుద్యోగుల బతుకులు మారతాయని ఆశిస్తే భంగపాటే ఎదురైందని అన్నారు. కొమరం నరేష్, పాయం బాలకృష్ణ, సోందె నర్సింహారావు, జానకిరామ్, రాముడు, నిరుద్యోగ యువకులు పాల్గొన్నారు.

## కొరమీను పెంపకంపై అవగాహన


పాంప్లెట్లతో అవగాహన కల్పిస్తున్న రవీందర్‌రావు

టేకులపల్లి, ఏప్రిల్ 22 : ప్రతి రైతు వ్యవసాయ అనుబంధరంగాలతో అధిక లాభాలపై వచ్చే విధంగా కొరమీను చేపల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో రవీందర్‌రావు అన్నారు. మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలో రైతులకు వ్యవసాయ అనుబంధ రంగాలపై వచ్చే లాభాల, వెదురు, మునగ సాగుతో పాటు ఆక్వా కల్చర్ కొరమీను చేపల పెంపకంపై పాంప్లెట్ల సహాయంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం రవికుమార్, 20 మంది రైతులు, సీసీలు, ఉదయ్ ఆక్వా సిస్టమ్ ప్రతి నిధులు పాల్గొన్నారు.

## ఐదెకరాల్లో మొక్కజొన్న పంట దగ్ధం



కాలిపోయిన మొక్కజొన్న పంట

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 22: గుర్తుతెలియని వ్యక్తులు మొక్కజొన్న పంటకు నిప్పంటించిన సంఘటన కొమరారం గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం బాధిత రైతు సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొమరారంలో తనకున్న ఐదెకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశానని, పంట చేతికొచ్చి కోత కోసే సమయంలో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పంటించారని బోరున విలపించాడు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత.. కేసు నమోదు

టేకులపల్లి, ఏప్రిల్ 22 : అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను టేకులపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం రాత్రి మద్రాస్‌తండా గ్రామానికి చెందిన బానోత్ వినోద్ శంభునిగూడెం వాగు నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ముత్యాలంపాడు క్రాస్‌రోడ్ వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## 'పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం'


మొక్కలు నాటుతున్న సింగరేణి అధికారులు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 22: ధరిత్రి దినోత్సవ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణకు పాటుపడదామని ఏజీఎం సివిల్ దనసరి వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణి సీఎండీ బలరాం ప్రేరణతో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం అభినందనీయమని అన్నారు. ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం సింగరేణి సివిల్ రైల్వే కాంట్రాక్టు కార్మికుల ఆధ్వర్యంలో కొండాపురం సీఎస్పీ రైల్వే సైడింగ్ ఆవరణలో సీఎస్పీ ఇంచార్జి డీజీఎం మదన్ నాయక్‌తో కలిసి మొక్కలు నాటారు. శేషగిరిరావు, సురేష్, ఇన్నయ్య, నవీన్‌కుమార్, రవివర్మ పాల్గొన్నారు.